సాక్షి ప్రకాశం

గురువారం । 18 । జనవరి । 2024



ఆశలు తీర్చేలా.. ఆసరా

వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత డ్వాక్రా రుణ మాఫీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈనెలలోనే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. - 10లో..



ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా?

సీఎం జగన్ సింగిల్‌గా పోటీ చేస్తున్నారని.. టీడీపీ, జనసేనలు ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా అని జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రశ్నించారు. - 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
30.7/21.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. దట్టమైన పొగ మంచు కురుస్తుంది.

ఫ్లాష్..ఫ్లాష్..ఫ్లాష్

ఫలించిన పేదల ఇంటి కల

- ఒంగోలులో పేదల ఇళ్ల పట్టాలకు రూ. 180 కోట్లు విడుదల

ఒంగోలు: ఒంగోలులో పేదల ఇళ్లకు సంబంధించి స్థలాల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 180 కోట్లు విడుదల చేస్తూ బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. యరజర్ల వద్ద మెగా టౌన్ షిప్ నిర్మించి 24వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తలంచారు. అయితే టీడీపీ, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుట్రలు పన్ని తన అనుచరులతో న్యాయపరమైన ఇబ్బంది కలిగించారు. అయితే ఇళ్లు లేని పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టాలు ఇవ్వాలని బాలినేని సంకల్పించారు. ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసి అయినా ఇవ్వాలని ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. అందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కలెక్టర్, అధికారులు నగరం నలుమూలలా ప్రైవేటు స్థలాల కోసం అన్వేషించారు. ఈ క్రమంలో మల్లేశ్వరపురం అగ్రహారం వద్ద 209 ఎకరాలు, వెంగముక్కలపాలెం వద్ద 220 ఎకరాలు సేకరించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి రూ. 210 కోట్లు అవసరం అవుతుందని తేల్చారు. అందులో భాగంగా తొలుత ప్రభుత్వం రూ. 30 కోట్లు మంజూరు చేసింది. తరువాత బాలినేని పలుమార్లు సీఎంను కలిసి పేదల ఇళ్ల పట్టాల కోసం విజ్ఞప్తి చేశారు. దీంతో మిగిలిన రూ. 180 కోట్లను బుధవారం అర్ధరాత్రి ప్రభుత్వం విడుదల చేసింది. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన తర్వాతే తాను ఎన్నికలకు వెళతానని ముందు నుంచీ చెబుతూ వస్తున్న బాలినేని తన మాట నిలబెట్టుకున్నట్లు అయింది. కాగా ఈ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 21.335 కోట్లు విడుదల చేసింది.

న్యూస్‌రీల్

దివ్యాంగుల రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు అర్బన్: జాతీయ వికలాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ ద్వారా బుధవారం 2023–24 సంవత్సరానికి సంబంధించి రుణం మంజూరు చేసేందుకు దరఖాస్తుదారుల్లో అర్హులైన దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 56 మంది దివ్యాంగులు హాజరయ్యారు. స్క్రీనింగ్ కమిటీ సభ్యులు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు, డీఆర్‌డీఏ ఏపీఎం ఆదిశేషు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి అర్జున్, మెప్మా ఏఓ పూర్ణ చంద్రరావు, బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఏఈఓ చిట్టిబాబు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

నేడు సామాజిక సమతా సంకల్పం

- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మా నాయక్

ఒంగోలు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వ సమతా సంకల్పం కార్యక్రమం గురువారం ఒంగోలు హెచ్‌సీఎం కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎస్ లక్ష్మానాయక్ తెలిపారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి హెచ్‌సీఎం సెంటర్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు మారథాన్ కార్యక్రమం, మానవహారం ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోటాపోటీగా జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ



పోటీలను ప్రారంభిస్తున్నమారం వెంకారెడ్డి

చీమకుర్తి: సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా సంతనూతలపాడు మండలం మంగమూరులో స్థానికులు నిర్వహించిన జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలను అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకుడు మారం వెంకారెడ్డి చేతుల మీదుగా మంగళవారం రాత్రి ప్రారంభించారు. స్థానిక అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు మారం వెంకారెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో కొండసింగ్ రాజు, పైడి యుగంధర్, గోపీకృష్ణ, ధనుంజయ్, స్థానికులు పాల్గొన్నారు.

పేదల పాలిట వరంగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో సరికొత్త ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇచ్చే ఆరోగ్యశ్రీ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఫలితంగా 3,257 రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ కార్డుంటే రూ.25 లక్షల వైద్యం మనచేతిలో ఉన్నట్టే. ఇప్పటికే కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి కూడా శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా ఆరు లక్షల కార్డులు పంపిణీ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటి వరకూ 71 వేల కార్డులు పంపిణీ చేశారు.

స్మార్ట్‌గా.. వేగంగా..

- జిల్లాలో ఆరు లక్షల కార్డుల పంపిణీ
- తొలిరోజే 23 వేల కార్డులు అందజేత
- 15 రోజుల్లో 71 వేల కార్డులు అందజేత
- గ్రామ సచివాలయాల ద్వారా ఇంటింటికీ..
- నెలాఖరులోగా పంపిణీ పూర్తికి చర్యలు
- కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్



ఒంగోలు టౌన్:

జిల్లాలో ఆరోగ్య శ్రీ స్మార్టు కార్డుల పంపిణీ కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. జనవరి 2వ తేదీన కార్డుల పంపిణీని ప్రారంభించారు. తొలి విడతలో జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలు, సచివాలయాల పరిధిలో కార్డులు పంపిణీ చేశారు. తొలిరోజే 25 వేల కార్డులు అందజేశారు. నాటి నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన కార్డులను వచ్చినట్లు పంపిణీ చేస్తున్నారు. తొలుత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి ఆరోగ్య శ్రీ కార్డులు చేరుకోగానే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ పరిశీలించి ఆయా ప్రాంతాలకు చెందిన మండలాభివృద్ధి అధికారులకు పంపిస్తున్నారు. అక్కడ ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సచివాలయాలకు చేరవేస్తున్నారు. అక్కడ నుంచి వలంటీర్లు ఇంటింటికీ తిరిగి స్మార్ట్ కార్డులను అందిస్తున్నారు. కేవలం 15 రోజుల్లో జిల్లాలో 71,331 స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 2.35 లక్షల కుటుంబాలకు ఆరోగ్య శ్రీ కార్డులు వచ్చాయి. 6,07,619 కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెల 30వ తేదీలోపు ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయనున్నారు.

కార్డుల పంపిణీ ఇలా...

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీకి సంబంధించి ఒక్కో గ్రామానికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక టీంలో వలంటీర్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఉంటారు. మరొక బృందంలో సీహెచ్ఓ, మహిళా పోలీసు, వలంటీర్, ఆశా కార్యకర్త ఉంటారు. వలంటీర్ కార్డు అందజేసి ఈకేవైసీ చేస్తారు. వెంటనే మహిళా పోలీసు కార్డుదారుని మొబైల్ ఫోన్‌లో ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తారు. ఏఎన్ఎం ఆరోగ్య శ్రీ కార్డును వినియోగించుకునే విధానాన్ని బ్రోచర్ ద్వారా వివరిస్తారు. ఆరోగ్య శ్రీ పథకంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారు.

ఆరోగ్యశ్రీ వైద్య సేవలను ఇలా పొందవచ్చు..

104కు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు ఆరోగ్యశ్రీ సేవలు పొందేందుకు అన్నీ మార్గాలు తెరుచుకుంటాయి. ఫోన్ చేసి అనారోగ్య వివరాలను తెలియజేస్తే చాలు సదరు కాల్ సెంటర్ అధికారి వివరాలు నమోదు చేసుకుంటారు. అవసరమైన వైద్య సేవలు అందించేందుకు గాను సమీపంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలోని ఆరోగ్య మిత్రకు సమాచారం వెళ్లిపోతుంది. ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తిస్థాయి వైద్య సేవలు అందేలా బాధ్యత తీసుకుంటారు. జిల్లాలోని సర్వజన ఆస్పత్రి, మాతా శిశు వైద్యశాల, జిల్లా ఆస్పత్రితో పాటుగా రెండు ఏరియా వైద్యశాలలు, 8 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. 64 ప్రాథమిక వైద్యశాలల్లో కూడా ఈ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలను అందిస్తారు. అలాగే 38 కార్పొరేట్ వైద్యశాల్లో ఆరోగ్య సేవలు అందిస్తారు. మొత్తం మీద జిల్లాలో 127 ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ వైద్యశాలలు ఉన్నాయి. 100 మంది ఆరోగ్య మిత్రలు అందుబాటులో ఉన్నారు. అలాగే జిల్లాలో 38 మండలాలకు గాను 104 వాహనాలు 48 ఉండగా, 108 వాహనాలు 40 ఉన్నాయి. వీటిలో అత్యవసర వైద్య చికిత్సకు అవసరమైన అన్నీ రకాల ఔషధాలు ఉంటాయి. ఒకవేళ రోడ్డు ప్రమాదం సంభవించినా , గుండెపోటు, పక్షవాతం లాంటి ఏదైనా అత్యవసర సమస్య వచ్చినప్పుడు 108 కి ఫోన్ చేస్తే చాలు నిముషాల వ్యవధిలోనే అంబులెన్స్ వచ్చేస్తుంది. ఘటనా స్థలం నుంచే అవసరమైన అత్యవసర వైద్య సేవలను అందిస్తూ ఆఘమేఘాల ఆరోగ్య నెట్‌వర్క్ వైద్యశాలలో చేర్పిస్తారు. అక్కడి వైద్య సిబ్బంది తక్షణ వైద్య సేవలను అందిస్తారు. అత్యవసరమైతే వెంటనే శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను రక్షిస్తారు.

స్మార్ట్ కార్డు ప్రత్యేకతలు...

కొత్తగా పంపిణీ చేస్తున్న ఆరోగ్య శ్రీ కార్డుల మీద 25 లక్షల పరిమితి వరకు వైద్యసేవలను పొందవచ్చని ముద్రించి ఉంటారు. ఇప్పటి వరకు ఆరోగ్య శ్రీ కార్డుల మీద కార్డు నెంబరు మాత్రమే ముద్రించి ఉండేవారు. కానీ ఇపుడు యూనివర్సల్ హెల్త్ ఐడీ నంబరును ముద్రించారు. అలాగే బార్ కోడ్ తరహాలో ఒక స్కానర్ ఇచ్చారు. దీన్ని స్కాన్ చేస్తే చాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు ద్వారా పేషంట్ ఆరోగ్య వివరాలు తెలుస్తాయి. గతంలో తీసుకొన్న చికిత్స తాలుకు వివరాలు, వ్యాధి నిర్ధారణ రిపోర్టులు, మందుల వినియోగం వివరాలు పొందుపరిచి ఉంటాయి. దీంతో చికిత్స కోసం వైద్యశాలకు వెళ్లినప్పుడు మనం పాత ఫైళ్లను తీసుకువెళ్లాల్సిన అవసరం ఉండదు. చికిత్స చేయడం కూడా సులువు అవుతుంది. ఈ కార్డు మీద ఇంటి యజమాని ఫొటోను, వెనుక కుటుంబ సభ్యుల ఫొటోలు, వివరాలు ఉంటాయి.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి



సామాన్య పౌరులు సైతం ఆరోగ్యశ్రీ సేవలను సులువుగా పొందేందుకు వీలుగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా మనకు కావలసిన వైద్య సేవలను మనం కోరుకున్న ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో పొందవచ్చు. మనం తీసుకున్న చికిత్స, చేయించుకున్న వైద్య పరీక్షలు, ఇతర ఆరోగ్య వివరాలను అవసరమైనప్పుడు తెలుసుకునే వీలుంటుంది. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ

ఆరోగ్యశ్రీ, పై అవగాహన పెంచుకోవాలి



ఆరోగ్యశ్రీ చికిత్స కోసం వెళ్లేటప్పుడు ఆరోగ్యశ్రీ కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి. మనం చికిత్స చేయించుకునే ఆస్పత్రికి వెళ్లగానే అక్కడ ఉండే ఆరోగ్య మిత్రను కలిసి ఓపీ రాయించుకోవాలి. వారికి స్పష్టంగా ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేయించుకోవాలనుకుంటున్నట్లు చెప్పాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ పథకం గురించి అవగాహన పెంపొందించుకోవాలి. ఒకవేళ ఎవరికైనా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రి మీద ఏదైనా ఫిర్యాదు చేయాలంటే అలాంటి అవకాశం కూడా ఉంటుంది. యాప్ ద్వారా కానీ, 104 ద్వారా కానీ ఫిర్యాదు చేయవచ్చు.

– డాక్టర్ హేమంత్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

కార్యకర్తలకు అండగా నిలుస్తా..

- మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జునతో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి తదితరులు

మద్దిపాడు: సంతనూతలపాడు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి వారిని కాపాడుకునే బాధ్యత తనదేనని నియోజకవర్గ ఇన్‌చార్జి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. గతంలో జరిగిన వాటిని వదిలేద్దామని, ప్రస్తుతం అందరం కలిసికట్టుగా పార్టీని నడిపి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. మండల కేంద్రం మద్దిపాడులో బుధవారం మండల నాయకులతో పరిచయ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేలా ప్రతి పని చేస్తానని అన్నారు. ప్రజలతో నాయకులు మమేకమై ఈ రెండు నెలలు పని చేయాలని, తద్వారా పార్టీని మరింత పటిష్టం చేసుకుందామన్నారు. పలువురు నాయకులు తమ ఆవేదనను వ్యక్తం చేయడం పట్ల ఆయన మాట్లాడుతూ నాగార్జున అనే వ్యక్తి ఉన్నంత వరకూ కార్యకర్తలకు అన్యాయం జరిగే పరిస్థితి ఉండదని, మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తానని, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దీవెనలతో రాజకీయాల్లోకి వచ్చానని అప్పటి నుంచి ఆ కుటుంబాన్నే కనిపెట్టుకుని ఉన్నానని చెప్పారు. సంతనూతలపాడు నుంచి పోటీ చేయాలని సీఎం జగన్ ఆదేశించారని, నాయకులందరినీ కలుపుకు పోతానన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డిల సహకారం తీసుకుని సంతనూతలపాడు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తానని అన్నారు. విజయవాడలో 206 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, తేళ్ల పుల్లారావు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, మజీద్, మాజీ ఎంపీపీ నారా విజయలక్ష్మి, గట్టినేని అయ్యన్న, మద్దా లక్ష్మీనారాయణ పల్లకి పద్మకుమారి, కోఆప్షన్ మెంబర్ మూసా, ఓబుల్‌రెడ్డి, లింగా రామకృష్ణారెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ అధ్యక్షులు, నాయకులు, కన్వీనర్లు గృహసారథులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మంత్రి ఆదిమూలపు సురేష్‌కు సంఘీభావం తెలుపుతున్న పార్టీ నాయకులు

సింగరాయకొండ: స్థానిక నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, రాబోయే ఎన్నికల్లో మనమందరం ఐక్యంగా ఉండి కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయటమే లక్ష్యంగా కృషి చేద్దామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ఏ కార్యకర్తకూ ఎన్నడూ అన్యాయం జరగదని, అందుకు తానే ఉదాహరణ అన్నారు. వైఎస్సార్ చొరవతో యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని తరువాత వైఎస్సార్ సీపీలో చేరి జగనన్న సహకారంతో సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి 23 మందిని టీడీపీలో చేర్చుకున్నారని, రాని వారిని నానా రకాలుగా కేసులు పెట్టి ఇబ్బందుల పాల్జేశారని, ఇందుకు కూడా తానే ఉదాహరణ అన్నారు. తనపై, తనభార్యపై సీబీఐ కేసు బనాయించారని ఒక ఎమ్మెల్యే అయితే టీడీపీ అరాచకాలను తట్టుకోలేక పార్టీ ఫిరాయించిందని, కానీ తాను మాత్రం జగనన్నకు అండగా నిలిచానని అన్నారు. అందుకు ప్రతిఫలంగా జగనన్న తనను రెండుసార్లు మంత్రిగా చేశారని కొనియాడారు. వైఎస్సార్ సీపీలో ఏనాడూ కార్యకర్తలకు అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు.

పటిష్ట ప్రణాళికతో ఎన్నికలకు:

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పటిష్ట ప్రణాళికతో ముందుకు పోతానని మంత్రి సురేష్ అన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకరరావు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వేమూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తో పాటు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తమ వంతు సహాయ సహకారాలు అందించారన్నారు. నియోజకవర్గంలో సమన్వయకర్తల మార్పుతో కొంత గందరగోళం జరిగిందని, కానీ నాయకులు, కార్యకర్తలు పార్టీకి అండగా ఉన్నారన్నారు. మీరందరూ పార్టీ పై ఉన్న పట్టును ఎక్కడా సడలించవద్దని.. వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో నీరు, రోడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేను నోరుపారేసుకోను..

టీడీపీ ఎమ్మెల్యే స్వామి రెండు సార్లు నియోజకవర్గానికి ఏమి ఒరగబెట్టారని మంత్రి సురేష్ ప్రశ్నించారు. స్వామి మాటలు చూస్తే కోటలు దాటుతున్నాయన్నారు. ఆయన తన మీటింగ్‌ల్లో అవాస్తవాలు చెబుతుంటే వాటిని పచ్చపత్రికలు ప్రచారం చేస్తాయన్నారు. వీరు వైఎస్సార్ సీపీ కార్యక్రమం ప్రారంభమయ్యే ముందు, తరువాత ఖాళీ కుర్చీలను తీసి ప్రచురిస్తారన్నారు. విమర్శలకు తాను భయపడనని స్పష్టం చేశారు. చంద్రబాబు కూడా కనిగిరి సభలో తనను టార్గెట్ చేసి.. దళితుడు అని చూడకుండా నన్ను చెత్త అన్నాడని.. నేను చెత్తో లేక బంగారమో నియోజకవర్గ ప్రజలే బాబుకు తెలియజెప్తారని అన్నారు. తనకు ఎక్కడా ఓటమి లేదని గుర్తు చేశారు. ''నేను నోరు పారేసుకోను. రాబోయే ఎన్నికల్లో మా నాయకులు, కార్యకర్తలే మీ సంగతి చూసుకుంటారు'' అని చెప్పారు. పార్టీ నాయకులు చేయి చేయి కలిపి మంత్రి సురేష్ కు తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్‌కు బాణాసంచా తో అపూర్వ స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. అంతకు ముందు సురేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, శ్రీశైలం దేవస్థాన బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ షేక్ షకీల, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, షేక్ పటేల్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్ బాషా, కనుమళ్ల సొసైటీ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు, షేక్ సలీంబాషా, మసనం వెంకట్రావు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా కులగణన సర్వే

- ఈ నెల 19వ తేదీ నుంచి సర్వే ప్రారంభం
- వీడియో సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో చేపడుతున్న కులగణన సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో బుధవారం వీడియో సమావేశం నిర్వహించి సర్వేపై దిశానిర్దేశం చేశారు. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి ఈ సర్వేను ప్రారంభించి చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే ప్రాధాన్యతను తెలుసుకుని సర్వే నిర్వహణ సమయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. వివరాల నమోదు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వేను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్‌లు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అందుకు అవసరమైన సన్నాహక సమావేశాన్ని మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గురువారం ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు 10 రోజుల పాటు స్థానికంగా అందుబాటులో లేని ప్రజలు వారి వివరాలను 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఐదు రోజులపాటు తమ పరిధిలోని సచివాలయంలో నమోదు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానికంగా ఉంటున్న కుల సంఘాల నాయకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు, సందేహాలను తీర్చేలా ఎంపీడీవోలు సర్వేపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. మండల స్థాయి అధికారులంతా వారికి కేటాయించిన గ్రామాలను ప్రతి రోజు సందర్శించాలని, సూపర్‌వైజర్లు కూడా ప్రతి రోజు ఫీల్డ్‌లో ఉండాలన్నారు.

ఈ నెల 19వ తేదీ విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరిస్తున్న కార్యక్రమానికి ప్రతి సచివాయం నుంచి ప్రజలు తరలివెళ్లేలా అవసరమైన రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని, సంక్షేమ శాఖల అధికారుల సహకారం తీసుకోవాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. విజయవాడలో నిర్వహించే కార్యక్రమ నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలకు, మార్కాపురం సబ్‌కలెక్టర్‌కు సూచించారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ముగిసిన చోట ఘనంగా ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించి విజేతలైన క్రీడాకారులను అభినందించి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపాలన్నారు. అసైన్డ్ ల్యాండ్ ఫ్రీ హోల్డింగ్ విషయంలో నిబంధనలు ఉల్లఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



మొదటి బహుమతి అందజేస్తున్న ఉడుముల, దాతలు

కొనకనమిట్ల: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని గొట్లగట్టు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా క్రీడాకారుల కేరింతలతో మంగళవారం రాత్రి ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోటీల్లో సాక్షి వెంకట్–గొట్లగట్టు గుమ్మా శ్రీను టీమ్‌లు తలపడగా సాక్షి వెంకట్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. రెండు, మూడు, నాలుగు బహుమతులను గుమ్మా శ్రీను, వింజవర్తిపాడు కొక్కెర చిన్నా, గొట్లగట్టు చరణ్ టీమ్‌లు గెలుచుకున్నాయి. తొలుత ఫైనల్ పోటీలను మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. గెలుపొందిన జట్లకు మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను దాతలు మోరా శంకర్‌రెడ్డి, పాదిలి రంజిత్ కుమార్, సూరవరపు పెదవెంకటరెడ్డి, కరవర్ల రాజేష్‌లు వరుసగా రూ.25 వేలు, రూ.20, రూ.15, రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, పోటీల నిర్వాహకులు ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, గోనుగుంట్ల శ్రీనివాసులు, పోలసాని నారాయణరెడ్డి, గుమ్మా శ్రీను, ఉప్పుటూరి పెదవెంకటయ్య, సచివాలయ కన్వీనర్‌లు అనుకు ఏడుకొండలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్‌పై పాటకు కలెక్టర్ తొలి పలుకులు


గీత రూపకర్తలతో కలెక్టర్ దినేష్‌కుమార్, డీఈఓ సుబ్బారావు

ఒంగోలు అర్బన్: ఈ నెల 19వ తేదీ విజయవాడ స్వరాజ్ మైదానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి కిషోర్‌బాబు సమర్పకుడిగా అంబేడ్కర్‌పై 'భారత రత్నమా–జాతికి దీపమా' అనే ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినిపించగా ఆ పాటకు తొలి పలుకులు అందించారు. ప్రత్యేక గీతాన్ని గురువారం అంబేడ్కర్ భవనంలో కలెక్టర్ చేతుల మీదుగా పాటను ఆవిష్కరించనున్నారు. రచయిత జ్యోతిర్మయి గీతాన్ని రచించగా గాయకుడు నూకతోటి శరత్‌బాబు ఆలపించారు. ఖాసీం సంగీతం అందించారు. దీనిలో డీఈఓ సుబ్బారావు పాల్గొన్నారు.

చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు


సింగరాయకొండలో ఆస్పత్రి రిజిస్టర్ పరిశీలిస్తున్న డాక్టర్ మౌనిక

సింగరాయకొండ: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి వ్యాక్సిన్లు అందించి ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆరోగ్య కార్యకర్తలపై ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) సర్వైలెన్స్ మెడికల్ అధికారి డాక్టర్ మౌనిక పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోల్డ్‌చైన్ కేంద్రాన్ని, గ్రామ సచివాలయం–4 పరిధిలోని ఇమ్యునైజేషన్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ.. వ్యాక్సిన్లు తయారీ కేంద్రం నుంచి బిడ్డకు చేరే వరకు సరైన పద్ధతిలో కోల్డ్‌చైన్‌ను పర్యవేక్షించాలని ఆదేశించారు. అప్పుడు మాత్రమే పొటెన్షియల్ వ్యాక్సిన్‌ను పిల్లలకు అందించగలమని, చిన్నారులకు జబ్బుల నుంచి రక్షణ కల్పించవచ్చని వివరించారు. ప్రతి సెషన్‌లో ఏఇఎఫ్ఐ కిట్‌తో పాటు ఏఇఎఫ్ఐ రిజిస్టర్ కూడా నిర్వహించాలని సూచించారు. డాక్టర చైతన్యకృష్ణ, ఫార్మసిస్ట్ ఎన్.పద్మ, హెచ్ఈఓ సయ్యద్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కొండమ్మ

లింగసముద్రం: గడ్డి కోసేందుకు వెళ్లిన మహిళకు విద్యుత్ షాక్ తగలడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన లింగసముద్రం మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కందుకూరు డీఎస్పీ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు మొగిలిచర్ల గ్రామానికి చెందిన పల్లాల మాల్యాద్రి, కొండారెడ్డిలు పొగాకుకు నీరు పెట్టేందుకు పొలాలకు సమీపంలో ఉన్న ఒక టెలికం టవర్‌కు ఉన్న 24 గంటల విద్యుత్ లైన్‌కు మోటార్ ఆడేందుకు తీగలను తగిలించారు. ఆ తీగలను పొలం గట్టుమీద వేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన యానదాసరి కొండమ్మ (55) గడ్డి కోసేందుకు వెళ్లింది. గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగలు చేతికి తగిలి షాక్ కొట్టడంతో కొండమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పొలానికి నీరు పెడుతున్నవారు గమనించి అక్కడకు వెళ్లి చూసి విద్యుత్ తీగలను తొలగించారు. విషయం తెలుసుకున్న కందుకూరు డీఎస్పీ రామచంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కొండమ్మ కుమార్తె ఉతియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాల్యాద్రి, కొండారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు.

ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయాలి


ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

పొదిలి రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని డీఎంహెచ్‌ఓ ఎస్.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. బుధవారం పొదిలి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ఆస్పత్రికి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కేసులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయాలని చెప్పారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సుగుణ కుమార్ ఉన్నారు.



ఆశలు తీర్చేలా.. ఆసరా

వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత డ్వాక్రా రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు

- ఈ నెలలోనే లబ్ధిదారుల ఖాతాల్లోకి ఆసరా సొమ్ము
- ఇప్పటికే 90 శాతం గ్రూపులకు బయోమెట్రిక్ పూర్తి



జిల్లాలో 'ఆసరా' లబ్ధిదారుల సంఖ్య	గత మూడు విడతల్లో జమ చేసిన సొమ్ము
3,08,258	రూ.703.51 కోట్లు
నాలుగో విడతలో చేయనున్న రుణమాఫీ	రూ.234.45 కోట్లు

బేస్తవారిపేట:

మహిళా సాధికారత, స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వపరంగా వారికి అన్ని విధాలా అండగా నిలుస్తూ చేయూత అందిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ అమలు చేస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారు. డ్వాక్రా మహిళలకు ఒకపక్క సున్నా వడ్డీకి రుణాలు అందించడంతో పాటు రుణమాఫీ చేసి, వారి సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకు డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని ప్రజా సంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు జిల్లాలో అర్హులైన డ్వాక్రా మహిళలకు ఇప్పటికే మూడు విడతల్లో రూ.703.51 కోట్ల మేర రుణమాఫీ చేశారు. త్వరలోనే నాలుగో విడత మాఫీ కింద రూ.234.45 కోట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందుకు సంబంధించి జిల్లా అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. వైఎస్సార్ ఆసరా పథకానికి అర్హులైన డ్వాక్రా మహిళల బయోమెట్రిక్ ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 31,302 గ్రూపుల్లో ఉన్న 3,08,258 మంది మహిళల బయోమెట్రిక్ నమోదు చేశారు. ఒక్కో మహిళ ఖాతాలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఈ నెలలోనే జమ చేయనున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేయగా, ఈ నెలలో నాలుగో విడత అందించడానికి సన్నాహాలు చేస్తుండటంతో మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారం చేపట్టిన తర్వాత మోసం చేశారని గుర్తు చేసుకుంటున్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఘంటాపథంగా చెబుతున్నారు.

చంద్రబాబు మోసానికి బలయ్యాం



గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు రుణమాఫీ చేస్తానని చెప్పి అసలు కాదు కదా వడ్డీ కూడా ఇవ్వలేదు. చంద్రబాబు హామీని నమ్మి బ్యాంకుకు డబ్బులు కట్టకపోవడంతో వడ్డీతో కలిపి భరించలేనంత భారం పడింది. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నారు. వడ్డీతోపాటు అసలు కూడా మా ఖాతాలో జమ చేస్తున్నారు. గత మూడు విడతల్లో నాకు రూ.36 వేలు రుణమాఫీ చేశారు. ఇప్పుడు నాలుగో విడతలో మరో రూ.12 వేల రుణం మాఫీ అవుతుంది.

– చిట్టా కాంతమ్మ, బేస్తవారిపేట

ఆసరా పథకం ఆదుకుంది



మా గ్రూపులో ఉన్న పది మంది మహిళలకు మూడు విడతలుగా జగనన్న రుణమాఫీ చేశారు. ఈ నెలలో నాలుగో విడత డబ్బులు వేస్తామని చెబుతున్నారు. నాకు ఇప్పటి వరకు రూ.33 వేలు రుణమాఫీ జరిగింది. నాలుగో విడతలో మరో రూ.11 వేలు రుణం మాఫీ కానుంది. వైఎస్సార్ ఆసరా పథకం నాబోటి మహిళలను ఎంతగానో ఆదుకుంది.

– దగ్గుపాటి లక్ష్మీదేవి, పాపాయిపల్లె

జగనన్నకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి. అందుకే అన్ని సంక్షేమ పథకాల్లో మహిళలకే పెద్ద పీట వేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద మహిళా సంఘాలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. నాకు ఇప్పటి వరకూ రూ.46 వేలకు పైగా రుణమాఫీ జరిగింది. ఇప్పుడు మరో రూ.12 వేలు రుణమాఫీ సొమ్ము వస్తుంది. సీఎం జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– మండెపల్లి బాలనాగమ్మ, బేస్తవారిపేట

ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా?

- జగనన్న అమలు చేస్తున్న పథకాలు వద్దని చెప్పే ధైర్యముందా?
- గతంలో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా?
- టీడీపీ మేనిఫెస్టోనే మాయం చేస్తే పవన్ ఎందుకు ప్రశ్నించలేదు?
- ఇద్దరు మోసగాళ్లు మరోసారి ఒక్కటై జనాన్ని మభ్యపెడుతున్నారు
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ తరఫున సింహంలా సింగిల్‌గా పోటీ చేస్తున్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు గానీ, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు గానీ ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా' అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. దర్శిలోని బూచేపల్లి నివాసంలో బుదవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయకుండా మేనిఫెస్టోనే మాయం చేసిన ఘనుడని ధ్వజమెత్తారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పుకుంటున్న పవన్‌కళ్యాణ్.. చంద్రబాబు హామీలపై ఏనాడైనా ప్రశ్నించాడా అని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను పదేపదే విమర్శించే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వాటిని తీసివేస్తామని చెప్పి ప్రజల్లోకి వచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. కరోనా కష్ట కాలంలో ప్రజల వైపు కన్నెత్తి చూడకుండా హైదరాబాద్‌లో దాక్కున్న మోసగాళ్లంతా ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ ఒకటై రాష్ట్రానికి వస్తున్నారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన పథకాలకు పేర్లు మార్చి ప్రజలను మోసం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని చెప్పారు. ఎన్నికల హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి దేశంలో జగన్ ఒక్కరేనని కొనియాడారు. దేశ చరిత్రలో మేనిఫెస్టోను మాయం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ పథకం కావాలన్నా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు వలంటీర్లు ప్రతి పథకం పార్టీలకతీతంగా నేరుగా లబ్ధి దారుని ఇంటికే చేరుస్తున్నారని గుర్తు చేశారు. దర్శి నియోజకవర్గంలో ఎటువంటి వర్గాలు లేవని నాతో సహా అందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్గమేనన్నారు. 20 ఏళ్లుగా జగనన్న వెంట ఉంటూ నియోజకవర్గంలో చేసిన సేవలను గుర్తించి మళ్లీ దర్శిలో పోటీ చేసే అవకాశాన్ని కల్పించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎటువంటి అవసరం ఉన్నా నేరుగా తనను కలవాలని భరోసా ఇచ్చారు. 175కు 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలన్న జగనన్న సంకల్పాన్ని నెరవేర్చేందుకు అందరూ కలసి కట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, తూము వెంకటసుబ్బారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, జెడ్పీటీసీలు రత్నరాజు, నుసుం నాగిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి అదృశ్యం

- విధులకు హాజరయ్యేందుకు వెళ్లి ఆచూకీ లేని వైనం
- పది రోజులవుతున్నా వీడని మిస్టరీ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు


వీరబ్రహ్మనందరెడ్డి (ఫైల్)

కొమరోలు : ఓ ఆర్మీ జవాన్ విధులకు హాజరయ్యేందుకు పశ్చిమ బెంగాల్‌కు వెళ్లి అక్కడ అదృశ్యమయ్యాడు. 10 రోజులు దాటినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొమరోలు మండలంలోని ఎర్రపల్లె గ్రామానికి చెందిన మారంరెడ్డి వీరబ్రహ్మనందరెడ్డి పదేళ్లుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని న్యూజల్పాయ్‌గురి క్యాంప్‌లో ఉంటున్నాడు. కాగా, డిసెంబరు 8వ తేదీన వీరబ్రహ్మనందరెడ్డి సెలవుపై స్వగ్రామానికి వచ్చి నెల రోజుల తర్వాత తిరిగి జనవరి 8వ తేదీన విధుల్లో చేరేందుకు స్వగ్రామం నుంచి బయలుదేరి వెళ్లాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఎల్‌జీపీటీ రైల్వేస్టేషన్‌లో దిగిన వీరబ్రహ్మనందరెడ్డి అక్కడే అదృశ్యమయ్యాడు. జనవరి 10వ తేదీన కుటుంబ సభ్యులతో మాట్లాడిన వీరబ్రహ్మనందరెడ్డి ఎల్‌జీపీటీ రైల్వేస్టేషన్‌లో అదృశ్యం కావడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బంధుమిత్రులు కూడా ఆ ప్రాంతానికి వెళ్లి వీరబ్రహ్మనందరెడ్డి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కలగజేసుకుని విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. వీరబ్రహ్మనందరెడ్డికి సంబంధించిన మొబైల్ ఫోన్, లగేజీ ఎల్‌జీపీటీ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరబ్రహ్మనందరెడ్డికి ఏడాది క్రితమే ఒంగోలుకు చెందిన భాగ్యలక్ష్మితో వివాహమైంది.

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం

- బీసీల మనోభావాలను కాపాడిన ఘనత ఆయనదే..
- చంద్రబాబు మోసపూరిత మాటలపై బీసీలు అప్రమత్తంగా ఉండాలి
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై న్యాయవాదులను లోకేష్ అండ్ కో రెచ్చగొడుతున్నారు
- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు



మాట్లాడుతున్న బొట్ల రామారావు

ఒంగోలు: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సామాజిక న్యాయం లభించింది ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మాత్రమే అని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలన కంటే ముందు నుంచి కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని తొలుత దర్శించుకునే భాగ్యం సన్నిధిగొల్లకు దక్కిందని, అయితే చంద్రబాబు మాత్రం దానిని రద్దుచేసి ఆ కుటుంబంలోని వారికి కేవలం నెలకు రూ.5 వేల జీతంతో కూడిన ఉద్యోగిగా అవకాశం ఇచ్చారన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యాదవుల మనోభావాలను దారుణంగా దెబ్బతీసిందన్నారు. అయితే వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక వేతనాన్ని రూ.18 వేలకు పెంచి ఉపశమనం కలిగిస్తే 2020 జూన్‌లో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంశపారంపర్య విధానాన్ని తిరిగి పునరుద్ధరించడమే కాకుండా సన్నిధిగొల్ల బదులుగా సన్నిధి యాదవ్‌గా మార్చి గౌరవించారన్నారు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగా మార్చుకుంటే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం సమాజానికి బ్యాక్ బోన్ అంటూ బీసీల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారని కొనియాడారు. టీడీపీ హయాంలో రాజ్యసభ సీట్లను ధనవంతులకు ఇస్తే.. జగనన్న మాత్రం అత్యధిక సీట్లను బీసీలకు కేటాయించారని పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కావాలంటూ పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రైవేట్ బిల్లు ప్రవేశపెడితే నాడు టీడీపీ ఎందుకు సహకరించలేదో టీడీపీలోని బీసీ నేతలు చంద్రబాబును నిలదీయాలని సూచించారు.

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానం భరత జాతి మొత్తానికి స్ఫూర్తిగా ఉండాలనే ఉద్దేశంతో ఈనెల 19న విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధిని ప్రతి ఒక్కరూ పరిశీలించాలని కోరారు. చంద్రబాబు బీసీలకు 24 అంశాలతో 2013లో పాదయాత్ర సందర్భంగా డిక్లరేషన్ ప్రకటించి ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో భూమికి సంబంధించి రికార్డులకు సరైన టైటిల్ ఉండేలా ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తీసుకువస్తే దానిపై తప్పుడు ప్రచారం చేస్తూ న్యాయవాదులను రెచ్చగొడుతున్న పచ్చ బ్యాచ్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ కురిచేడు మండల అధ్యక్షుడు యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి సుంకర సురేష్ పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

సీఎస్‌పురం(పామూరు): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం సీఎస్ పురం మండలంలోని కంభంపాడు గ్రామ సమీపంలో చప్టా వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. పామూరు మండలం కంబాలదిన్నెకు చెందిన రాయవరపు నారాయణ దంపతులు సీఎస్‌పురం మండలం జంగంవారిపల్లెకు వ్యక్తిగత పని మీద బైక్‌పై వెళ్లి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో కంభంపాడు సమీపంలో సీఎస్‌పురం మండలం గణేశునిపల్లి గ్రామానికి శరత్ బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ప్రమాదంలో నారాయణ, శరత్ తీవ్రంగా గాయపడగా సీఎస్‌పురం 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి పామూరు ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సలహామేరకు నారాయణను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.


దోస్త్ మేరా దోస్త్..!

- 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న 1984 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు


పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

కనిగిరి రూరల్: నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు బుధవారం కలుసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకుని, కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ అపూర్వ సమ్మేళనానికి కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. 1984లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు చిన్న నాటి సంగతులు గుర్తు చేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాలలో కలియదిరిగి సందడి చేశారు. అమెరికాలో స్థిరపడిన చలువాది మధు, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓలు సుకుమార్, రమణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మాఘం శ్రీను, వేణుగోపాల్‌రెడ్డి, బాషా, లతీఫ్, జహీర్, న్యాయవాది నాయబ్ రసూల్, డీఈ ఖాజావలి, మేనేజర్ కె.శ్రీను, డాక్టర్ విజయ్ కుమార్, పరశు సత్యగోపాల్, రామ్మోహన్, శంకర్, నర్సారెడ్డి, బాదం సత్యం, పార్థసారథి, బి.శేఖర్‌తో సహా 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. రాచమల్ల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ)ని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉన్నత పాఠశాలలో సమావేశ మందిరానికి అవసరమైన సామగ్రిని అందజేస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'సీఎస్ పురం'


విజేతలకు కప్ అందజేస్తున్న జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): సంక్రాంతి సందర్భంగా సీఎస్ పురం జెడ్పీహెచ్ఎస్ గ్రౌండ్‌లో ఈనెల 12న ప్రారంభమైన కేఎస్ రాయల్, ఎస్‌వీ ప్రసాద్ ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల స్థాయి మెగా క్రికెట్ టోర్నీ బుధవారంతో ముగిసింది.మొత్తం 56 జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. సీఎస్‌పురానికి చెందిన మధు, మహి టీం విజేతగా నిలిచి ప్రథమ బహుమతి రూ.50 వేలు అందుకుంది. సీఎస్ పురం హోం టీమ్‌కు ద్వితీయ బహుమతి రూ.30 వేలు, ఏనిగడ్ల జట్టుకు తృతీయ బహుమతి రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన మధు టీమ్‌కు రూ.10 వేలను దాత సహకారంతో అందజేశారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ముత్యాల భారతీనారాయణరెడ్డి, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, సర్పంచ్ శ్రీరామ పద్మావతి, ఏఎంసీ డైరెక్టర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.